క్లుప్తంగా

ఎన్‌ఎంయూ నిరాహార దీక్షలు



ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూ కార్మికులు

కుప్పం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్‌ఎంయూ కార్మికులు మంగళవారం స్థానిక డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. రాష్ట్ర నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు తామీ నిరసనకు దిగినట్లు డిపో అధ్యక్షులు మునుస్వామి, డిపో కార్యదర్శి జయపాల్ తెలిపారు. మాట్లాడుతూ, కుప్పం ఆర్టీసీ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డులకు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని, ఎస్‌ఆర్‌బీఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని, గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అన్ని యూనిట్లలో పెండింగ్‌లో ఉన్న ఏఏఎస్ ఇంక్రిమెంట్లు, పనిష్మెంట్లు పూర్తయిన వారికి సకాలంలో ఇంక్రిమెంట్లు కలపాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇతర డిమాండ్లపై నినదించారు.శిబిరంలో ఎన్‌ఎంయూ సంయుక్త కార్యదర్శి మునెప్ప, కార్మికులు జంపనూరు శ్రీనివాసులు, మొగిలీశ్వరయ్య, నారాయణ, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు



స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్

కుప్పం: రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం నుంచి స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్టు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ అన్నారు. స్లాట్ బుకింగ్‌పై మంగళవారం దస్తావేజు లేఖరులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టిందని, స్లాట్ బుకింగ్ సమయంలో హాజరుకాని పక్షంలో మరుసటి రోజు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. దీని వల్ల వినియోగదారులకు సమయం వృథా కాదని, సకాలంలో వచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. గతంలో మాదిరిగా క్యూలలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండదని, స్లాట్ బుక్ చేసుకుంటే నేరుగా కేటాయించిన సమయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వినోద్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

నిర్మాణాలకు సులువుగా అనుమతులు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని భవన నిర్మాణాలకు పారదర్శకంగా, అత్యంత సులభతరంగా అనుమతులు మంజూరు చేయనున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు సొంత అఫిడవిట్లను సమర్పించి, భవన నిర్మాణ అనుమతులు పొందాలన్నారు. అలాగే లైసెన్సుడ్ సర్వేయర్లు తమ దరఖాస్తులను మున్సిపాలిటీకి సమర్పించి, లైసెన్సులు పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

పదోన్నతి ఏఎన్‌ఎంలకు సన్మానం




పెద్దపంజాణి: మండలంలోని పలు సచివాలయాల్లో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తూ ఇటీవల గ్రేడ్-1 ఏఎన్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిని ఎంపీపీ రెడ్డెప్ప, మండల స్థాయి అధికారులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

పెద్దయల్లకుంట్లలో అగ్ని ప్రమాదం



చౌడేపల్లె: మండలంలోని పెద్దయల్లకుంట్లలో నడి బొడ్డున ఉన్న పాడుబడిన బావిలో చెత్తాచెదారం, ముళ్లపొదలకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బావి పక్కనే గడ్డివాములు ఉన్నాయి. మంటలను చెలరేగడంతో గమనించిన స్థానికులు ఎక్కడ గడ్డివాములు అంటుకుంటాయోనని ఆందోళన చెందారు. ఎట్టకేలకు రైతు సురేంద్రరెడ్డి సహకారంతో స్థానికులు కలిసి మంటలను ఆర్పారు. లేనిపక్షంలో గడివాములకు మంటలు వ్యాపించి ఉంటే పెనుప్రమాదానికి దారి తీసి ఉండేది.

సామూహిక పారాయణం



చౌడేపల్లె: అక్షయ తృతీయ సందర్భంగా మండలంలో పుదిపట్లలోని స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో మంగళవారం సామూహిక సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో వైష్ణవిదేవి కు విశేష అలంకరణ చేసి ఈ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అలాగే కాలభైరవుల విగ్రహాలకు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

టమా‘టా’..!

మొన్నటి వరకు వరకు బంతి పూల ధర పతనంతో సతమతమైన కుప్పం రైతాంగంపై ‘మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందం’గా ఇప్పుడు టమాట ధరల రూపంలో మరో ఉపద్రవం వచ్చిపడింది. కుప్పం మార్కెట్‌లో వారం రోజులుగా టమాట కిలో రూ.2 నుంచి 6 రూపాయల వరకు పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఖర్చులు రాకపోవడంతో కొంత మంది టమాట కోయకుండా తోటల్లోనే వదిలిపెట్టాల్సిన పరిస్థితి కలిగింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బంతి పూలు, టమాట రైతులు కోరుతున్నారు.

- కుప్పంలో పతనమైన ధరలు
- మొన్న బంతి..ఇప్పుడు టమాట
- పంటను కోయక తోటల్లోనే వదిలేస్తున్న వైనం
- కుదేలవుతున్న కుప్పం రైతాంగం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు





కుప్పం మార్కెట్‌కు వచ్చిన టమాట (ఇన్‌సెట్) తోటలోనే వదిలిపెట్టిన టమాట

కుప్పం రూరల్: ఇటీవలే కుప్పం నియోజకవర్గంలో బంతి పూల ధరలు పతనమై కిలో రూ.5 నుంచి సాగుతూ వచ్చి మంగళవారం మార్కెట్‌లో కిలో రూ.20 వరకు పలికింది.. రైతులు హమ్మయ్య కోత కూలీ, రవాణా ఖర్చులైనా వస్తాయిలే అని ఒకింత ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో టమాట ఇప్పుడు దెబ్బకొట్టింది. వారం రోజులుగా కుప్పం మార్కెట్‌లో 15 కిలోల క్రేట్ రూ.30 నుంచి రూ.90 వరకు పలుకుతోంది. ఈ ప్రకారం చూస్తే సాధారణ రకం కిలో రూ.2, మేలిమి రకం రూ.6 వరకు ఉంటోంది. ఇది రైతన్నలకు శరాఘాతమైంది.

దిగుబడి పెరిగి..పెట్టుబడి రాక..

కుప్పం నియోజకవర్గంలో ఈ ఏడు 1,777 ఎకరాల్లో రైతులు ఏకకాలంలో టమాట సాగు చేయడంతో ధరల పతనానికి కొంతవరకు దారి తీసింది. దీనికి తోడు బెంగళూరు, చెన్నై చుట్టు పక్క టమాట పెద్ద ఎత్తున సాగు చేయడంతో కుప్పం మార్కెట్‌లో టమాట కొనేందుకు వ్యాపారులు రావడం తగ్గుముఖం పట్టడం కూడా ధరల పతనానికి మరో కారణమైందని తెలుస్తోంది. మూడు నెలల పాటు ఉండే టమాట పంట ఎకరా సాగుకు 50 వేల నుంచి 60 వేల వరకు ఖర్చవుతుంది. దీని రవాణా, కోత కూలీ అదనం. నాటిని 45 రోజుల నుంచి టమాట కోతకు వస్తుంది. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు కోత కోస్తుండడం, మార్కెట్‌కు ఎక్కువగా సరుకు వస్తుండడంతో ధరలు పతనానికి దారితీస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్న మరోమాట. పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం పెట్టుబడి కాదు కదా.. కోత కూలీ కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గత నెల మొత్తం బంతిపూలు, ఇప్పుడు టమాట ధరలు పతనం కావడంతో కుప్పం రైతులు కుదేలవుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పంట సాగు చేస్తే తీరా చేతికందే సమయంలో ధరలు పతనం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం కుప్పం రైతులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ధరల స్థిరీకరణ నిధి అయినా ఏర్పాటు చేయాలని లేదా షరతులు లేకుండా పెట్టుబడి సాయమైనా చేయాలని కోరుతున్నారు.

అధికారిక లెక్కల ప్రకారం కుప్పం నియోజకవర్గంలో మండలాల వారీగా సాగువుతున్న టమాట సాగు వివరాలు

కుప్పం	: 320 ఎకరాల్లో
గుడుపల్లె	: 175
శాంతిపురం	: 652
రామకుప్పం	: 330
మొత్తం	: 1777 ఎకరాలు

ఇలా అయితే టమాట సాగు కష్టమే



ఎకరా టమాట సాగుకు 50వేల రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేస్తే కిలో మార్కెట్‌లో రూ.5 పలికింది. ఈ లెక్కన 10 వేల రూపాయలు కూడా చేతికి వచ్చే అవకాశం లేదు. 40 వేల రూపాయలు అప్పు మిగిలే ఉంటుంది. మళ్లీ సాగు పెట్టుబడి కోసం మరలా అప్పు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ధరలు లేని సమయంలో రైతులకు పెట్టుబడి సాయమైనా చేస్తే బాగుంటుంది.

–నరసింహప్ప, ఊరునాయునికొత్తూరు

తోటలోనే వదిలిపెట్టా



ధరలు లేకపోవడంతో టమాట పంటను వదిలేశాను. కోత, రవాణా ఖర్చులు రావడం లేదు. రైతులు వలస పోయే పరిస్థితి కలుగుతోంది. ఇప్పటికే మా ఊర్లో వ్యవసాయం గిట్టుబాటు కాక బెంగళూరులో కూలీలుగా మారారు. బంతి, చామంతి, టమాట సాగుపైనే ఆధారపడ్డ మాకు వలసలు తప్పడం లేదు. పంటలకు పరిహారమైనా ఇవ్వాలి.

–వెంకటపతి, ఊరునాయునికొత్తూరు

నోటీస్ బోర్డు

• ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న ఐటీఐ కాలేజీలో వివిధ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి కోరారు. మే నెల 24వ తేదీ సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, 26న రికార్డులు పరిశీలించి, కోర్సులు కేటాయిస్తామన్నారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్, మెకానికల్ డీజిల్, వెల్డర్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు రెండు సంవత్సరాలు, సంవత్సర కాల వ్యవధితో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్

పెద్దపంజాణి: మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు(వాసు) తనిఖీ చేశారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పవిత్ర జలాలను తీసుకెళ్తున్న అధికారులు, అర్చకులు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, అర్చకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదీ అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో తొలుత కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ గర్భాలయం, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, ఆనంద నిలయ గోపురం, పూజా సామగ్రి మొదలైన వాటిని నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలను కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు వేశారు..దాహార్తి తీర్చారు



బోరులో పుష్కలంగా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న నాగరాజు, ప్రజలు

వి.కోట: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చోట్ల కొత్తగా బోర్లు వేయిస్తున్నట్టు వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి తెలిపారు. పంచాయతీలోని 5వ వార్డు బ్రహ్మణ వీధి, జైబీమ్ నగర్‌ల వాసుల వినతి మేరకు మంగళవారం పంచాయతీ నిధులను మంజూరు చేయించి బోరు వేయించారు. పుష్కలంగా నీరు రావడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వార్డు మెంబర్ కుమార్‌రాజా పాల్గొన్నారు.

గుండెపోటుతో టీచర్ మృతి



రోషన్ అలీఖాన్ (ఫైల్)

పలమనేరు: పట్టణానికి చెందిన టీచర్ రోషన్ అలీఖాన్ మంగళవారం గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. 1998 డీఎస్సీలో ఎంపికైన వారితోపాటు రెండేళ్ల క్రితమే ఆయన ఉద్యోగంలో చేరారు. ఆయన మృతికి సహచర ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 98 డీఎస్సీ టీచర్లు వయసు రీత్యా అనారోగ్య సమస్యలతో మృతి చెందుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఇలాంటి మృతుల కుటుంబాలకు విరమణ సౌలభ్యం, పింఛను సౌకర్యాలను కల్పించాలని ఎంటీఎస్ సంఘ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు విజ్ఞప్తి చేశారు.

పరీక్ష తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. అయన మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలో 111 మంది విద్యార్థులు పదవ తరగతిలో ఫెయిల్ అయ్యారని, వీరందరికీ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌స్టంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులుకావాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంటువ్యాధులపై అవగాహన



అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పంచాయతీ ఈఓ

వి.కోట : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే అంటువ్యాధులను దరిచేరవని మేజర్ పంచాయతీ ఈఓ శివశంకర్ అన్నారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా అంటువ్యాధులపై అవగాహన కల్పించేందుకు కళాజాత నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

లాప్రోస్కోపిక్‌పై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య ప్రతినిధులు

గుడుపల్లె: వైద్య విద్యార్థులకు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సపై నైపుణ్యం ఉండాలని తిరుపతి స్విమ్స్ ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ముక్తేశ్వరయ్య అన్నారు. పీఈయస్ వైద్య కళాశాలలో నిర్వహించిన లాప్రోస్కోపీ సర్జికల్ శిక్షణ క్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రాథమిక దశలో హెర్నియ చికిత్స నుంచి ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స వరకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ వైద్య కళాశాలల వైద్య ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి ,హారీష్, రామక్రిష్ణ, సునీల్‌కుమార్, పీఈయస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాల్ ర్యాలీ సుబ్బారావు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



రొంపిచెర్లలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

రొంపిచెర్ల: తమకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రొంపిచెర్లలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. దీనికి నేతృత్వం వహించి పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏఐటీయూసీ యూనియన్ గౌరవధ్యక్షులు, కార్యదర్శులు అలివేలమ్మ, సరస్వతి మాట్లాడారు. బాల సంజీవని యాప్‌ను అంగన్‌వాడీలకు అనువుగా సవరించి పనిభారం తగ్గించాలన్నారు. అలాగే ప్రతి నెల 5వ తేది లోపు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ పిల్లలకు టేక్‌హోం రేషన్‌తో మే నెల సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతి నెల మొదటి వారంలోనే స్టాక్ అంతా ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాలు, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, ఈశ్వరమ్మ, లావణ్య, హసీనా, సంపత్‌కుమారి, జయమ్మ, సుస్మిత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాతసామాన్ల షాపు దగ్ధం

పుంగనూరు: అగ్నిప్రమాదంలో పాతసామాన్ల షాపు దగ్ధమైన సంఘటన మంగళవారం స్థానిక రామ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణానికి చెందిన దాదాపీర్ ఆ ప్రాంతంలో పాతసామాన్ల షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ ప్రాంతంలో సిగరెట్ తాగి ఆముక్కను ఆర్పకుండా పడేయడంతో మంటలు రేగి షాపులో మంటలు రేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే సుమారు రూ.30 వేలు విలువ చేసే సామాన్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

మేడే రోజున ఎర్రజెండాలు ఆవిష్కరించండి



మాట్లాడుతున్న నాగరాజు, వెంకట్రమణారెడ్డి

పుంగనూరు: కార్మిక దినోత్సవం మే 1న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుకు వ్యతిరేకంగా ఎర్రజెండాలు ఎగురవేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పట్టణంలో కార్మికులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ, 44 లేబర్ కోడ్ కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ చట్టాలుగా కేంద్ర ప్రభుత్వం మార్చడం దుర్మార్గమని నిరసించారు. 48 కోట్ల మంది కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రామమ్మూర్తి, ఏఐటీయూసీ నాయకులు వెంకట్రమణారెడ్డి, వెంకటేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

మేడే విజయవంతం చేద్దాం

చౌడేపల్లె: వివిధ రకాల ట్రేడ్ యూనియన్లు కలిసి ఐకమత్యంగా మేడే వేడుకలను స్థానిక బస్టాండులో విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం ట్రేడ్ యూనియన్లతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంకు అసోసియేషన్ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బ్యాంకు రెడ్డెప్ప, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వాసు, బహుజన సేవా సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ

పులిచెర్ల(కల్లూరు): వగళ్లవారి పల్లె వద్ద నూతన ఎల్లమ్మ ఆలయంలో 45రోజుల పూజల అనంతరం మండల పూజ నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ గోటూరి మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు.

పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణ పనులు తనిఖీ



రాయలపేట చెరువులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లెలో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ బాలాజి, ఏపీఓ మురుగేష్ తనిఖీ చేశారు. మండలానికి మంజూరైన 27 పనులకు గాను 20 పనులు పూర్తయినట్లు వారు తెలిపారు. అలాగే రాయలపేట, వీరప్పల్లి పంచాయతీలో చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

కిశోర బాలికలకు మంచి భవిష్యత్తు ఇద్దాం



రొంపిచెర్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ



పులిచెర్ల :మాట్లాడుతున్న ఎంపీడీఓ



సదుం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీఓ

రొంపిచెర్ల: గ్రామాల్లో బాల్య వివాహాలను జరగకుండా నిరోధించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై వర్క్‌షాప్ నిర్వహించారు. అయన మాట్లాడుతూ, పిల్లలు వారి కలలు నెరవేరక ముందే బాల్య వివాహాలకు బలైపోతున్నారని, రేపటి పౌరులైన కిశోర బాలికలను మంచి భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, ఎంఈఓ ఇందిర, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): కిశోర వికాసంతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ రాజశేఖర బాబు పేర్కొన్నారు. పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ వివక్ష నిర్మూలన, బాలికల హక్కు కౌమార బాలికలకు నాయకత్వం, రుతుక్రమం-శుభ్రత, రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, హెల్త్‌సూపర్‌వైజర్ శారద, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై వేసవి శిబిరాలు

సదుం: కిశోర వికాసం కార్యక్రమంపై మే 2 నుంచి జూన్ 10 వరకు సచివాలయాల వారీగా వేసవి శిబిరాలు నిర్వహిస్తామని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ మల్లీశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై వర్క్‌షాప్ నిర్వహించారు. బాల్య వివాహాలను నిరోధించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆమె కోరారు. ఎంపీడీఓ హరిబాబు సైబర్, ఆన్‌లైన్ మోసాలను వివరించారు. రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రతపై డాక్టరు గిరీశా తెలియజేశారు. ఎంఈఓ దామోదర, ఏపీయం హరిప్రసాద్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: యుక్తవయసులో ఉన్న బాలికల ఉజ్వల భవితకు కిశోర వికాసం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ షబ్బీర్ అహమ్మద్, ఎంఈఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బందికి కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సులోచన, రమాదేవి తదితరులు మాట్లాడారు.

పుంగనూరులో..

పుంగనూరు: కిశోర బాలికలు, మహిళలు పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయేషా నస్రీన్‌తాజ్ ఆధ్వర్యంలో తూర్పుమొగశాల సచివాలయంలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు ఏయే అంశాలపై ప్రధానంగా అవగాహన కల్పించాలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఏఎన్‌ఎంలు, సీఆర్పీలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా నిరోధించాలని పలమనేరు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర బాలిక వికాసంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మే 2 నుంచి జూన్ 10 వరకూ కిశోరి వికాసం వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శారద, లత, గీతమ్మ, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి, ఏపీఎం మీరాభాయి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

2 నుంచి కిశోర వికాస శిబిరాలు

శాంతిపురం: కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మే 2 నుంచి నిర్వహించ తలపెట్టిన వేసవి శిబిరాలను సిబ్బంది విజయవంతం చేయాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు. మంగళవారం మండల సచివాలయంలో అంగన్‌వాడీ వర్కర్లకు వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓలు కల్పన, అమరజ్యోతి, సూపర్‌వైజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

పలమనేరు: కిశోర వికాసంపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలను నిరోధించడం, చిన్నవయసులోనే గర్భం దాలిస్తే కలిగే అనర్థాలు, బాలికలు సమాజంలో ఎ లా మెలగాలి? ఇత్యాది అంశాలపై ఐసీడీఎస్ అధికారులు గ్రూపు మహిళలకు అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఇతర అధికారులు ఆవిష్కరించారు. స్థానిక వైద్య సిబ్బంది, సచివాలయాల ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



చౌడేపల్లె: మాట్లాడుతున్న ఏఓ



పెద్దపంజాణి: మాట్లాడుతున్న ఇందిరా ప్రియదర్శిని



శాంతిపురం: మాట్లాడుతున్న అమరజ్యోతి